క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వీపనగండ్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నూతన ఓటరుగా నమోదు అయ్యేందుకు దరఖాస్తులు చేసుకోవాలని తూంకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు రామన్‌గౌడ్, సీఈఓ రాము రైతులకు విజ్ఞప్తి చేశారు. నూతన ఓటరుగా నమోదు కావాలనుకునే రైతులు పట్టాదారు పాస్‌బుక్ కలర్ జిరాక్స్, ఆధార్‌కార్డు, ఆర్‌ఓఆర్, 4 పాస్ ఫొటోలతో పాటు రూ.350 సభ్యత్వ రుసుము చెల్లించి సింగిల్ విండో కార్యాలయంలో అందజేయాలని కోరారు. వీపనగండ్ల, కల్వరాల, బొల్లారం, తూంకుంట, సంగినేనిపల్లి, సంపత్‌రావుపల్లి, బుసిరెడ్డిపల్లి, రాయినిపల్లి గ్రామాల రైతులు ఈ నూతన సభ్యత్వాల కోసం దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని ప్రజలు సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ వెంకటస్వామి సూచించారు. ప్రజా పాలన కార్యక్రమంలో చాలా మంది రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి పథకం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇదే అదునుగా చేసుకొని సైబర్ మోసగాళ్లు మహాలక్ష్మి పథకం డబ్బులు పడతాయంటూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తెలియని వారు ఫోను చేసి ఓటీపీలు అడిగితే చెప్పొద్దన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఇంగ్లిష్ మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి శ్రావణి రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేక అధికారి లలిత, పీఈటీ చిట్టి తెలిపారు. ఆదివారం వనపర్తి జిల్లాలోని కంచిరావుపల్లిలో నిర్వహించిన జూనియర్ కబడ్డీ సెలక్షన్‌లో విద్యార్థి పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. ఈ నెల 10వ తేదీన గజ్వేల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని ప్రత్యేక అధికారి, పీఈటీతో పాటుగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బిల్కిస్‌బానో గెలుపు మహిళల విజయం

పాన్‌గల్: సుప్రీంకోర్టులో సామూహిక అత్యాచార బాధితురాలు బిల్కిస్‌బానో గెలుపు మహిళలందరి విజయమని భారత జాతీయ మహిళ సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టు ప్రసాదించిన క్షమాభిక్షను సుప్రీంకోర్టు సోమవారం రద్దు చేస్తూ తీర్పునిచ్చిందన్నారు. పట్టువదలని ఆమె న్యాయ పోరాటం మహిళలందరికీ ఆదర్శప్రాయం అని ఆమె పేర్కొన్నారు. మహిళల కేసుల్లో నేరస్తులను కాపాడే గుజరాత్ ప్రభుత్వం వంటి ప్రభుత్వాలకు ఈ తీర్పు కనువిప్పు కావాలన్నారు.

కంప్యూటర్ చోరీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కంప్యూటర్‌ను ఎత్తుకెళ్లారని హెచ్‌ఎం వెంకటయ్య తెలిపారు. ఈ ఘటనపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

పెంట్లవెల్లి: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందని జగద్గురు గాయత్రీ పీఠాధిపతి శ్రీకాంతేంద్ర స్వామి అన్నారు. సోమవారం మండలంలోని మల్లేశ్వరంలో అగస్త్యేశ్వర లింగానికి పీఠాధిపతి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపాటి నాగరాజు, నారాయణెడ్డి, పోతుల వెంకటేశ్వర్లు, శ్రీహరి, శ్రీను, రొడ్డ నాగేష్, శేఖర్, కుర్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆరోగ్య పరిరక్షణకు టీకాలు

అమరచింత: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్న పది, ఐదో తరగతి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు టీడీ టీకాలు వేస్తున్నామని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ, బాలికల, విజేత ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సోమవారం టీడీ వ్యాక్సిన్లు వేశారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పదేళ్లు, 15 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. ఈనెల 19 వరకు అన్ని కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు బలరాముడు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాన్‌గల్: విద్యార్థుల్లో ధనుర్వాతం రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకే టెటానస్ టాక్సైడ్ టీకాలు వేస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ, ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఈ టీకాలను వేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు డిఫ్తీరియా వ్యాక్సిన్ వేసినట్లు అసిస్టెంట్ హెల్త్ అసిస్టెంట్ శివకుమారి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు విజయకుమార్, రాంప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, మల్లికార్జున్, పీఈటీ ఇందిర, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రాజశేఖర్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది చిన్నమ్మ, స్రవంతి పాల్గొన్నారు.



రంగాపురంలో విద్యార్థులకు టీకాలు వేస్తున్న సిబ్బంది



.పాన్‌గల్‌లో..



అమరచింతలో..

ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదిన వేడుకలు



విద్యార్థినికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు

సాక్షి, నెట్‌వర్క్: వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు సోమవారం ఉదయం ఖిల్లాఘనపురం మండలంలోని గట్టుకాడిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దమందడి మండలంలోని వెల్టూరులో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీ గురుకుల హాస్టల్, కస్తూర్బా గాంధీ పాఠశాల, ఎస్సీ గురుకుల బాలికల హాస్టల్, అనాథ, వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు కేక్ తినిపించి, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కిచ్చారెడ్డి, లక్కాకుల సతీష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్, కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, బ్రహ్మం, చీర్ల సత్యం, జయ సుధ, సుమిత్ర, విభూతి నారాయణ, ఎంఈఓ ఉషారాణి, ప్రత్యేక అధికారి లలిత పలువురు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

అధికారుల సేవలు అభినందనీయం



తహసీల్దార్ బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయేజ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాల్‌రెడ్డిని కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్లే ప్రజా పాలన కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూశారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచుపల్లియాదవ్, నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, విశ్వనాథం, శివరాములు, మాసన్న, మోహన్‌రెడ్డి, లతీఫ్, సలీం ఖాన్, రాంలాల్‌నాయక్, రాములుయాదవ్, ముజీబ్, ముస్తాఫా, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బస్సు పునరుద్ధరించాలని వినతి

కొత్తకోట రూరల్: మండలంలోని రాయిణిపేట మీదుగా ఆర్టీసీ బస్సును నడపాలంటూ సోమవారం ఉప సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, గ్రామస్తులతో కలిసి వనపర్తి డిపో డిప్యూటీ మేనేజర్ దేవేందర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 15ఏళ్లుగా వనపర్తి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సు పెద్దగూడెం, కడుకుంట్ల, రాయిణిపేట మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేదని, 2014 తర్వాత ఆర్టీసీ అధికారులు బస్సును రద్దు చేశారని వివరించారు. దీంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని గతంలో మాదిరిగానే బస్సును నడపాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రకాష్‌గౌడ్, మోహన్‌రెడ్డి, వెంకటస్వామిచారి తదితరులు ఉన్నారు.



డిప్యూటీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

వేతనాల్లో కోత సరికాదు



మాట్లాడుతున్న సురేష్

వనపర్తి టౌన్: వేతనాల్లో కోత పెట్టి కార్మికుల శ్రమ దోచుకుంటున్న ఆస్పత్రిలోని వర్క్ కాంట్రాక్ట్ ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి, క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు టెండర్లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఆస్పత్రిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అన్ని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీఓలు, సర్క్యూలర్ లోపాభూయిష్టంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు దోచిపెట్టే విధంగా గైడ్‌లైన్స్‌లు ఉన్నాయని ఆరోపించారు. థర్డ్ పార్టీ ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు చెల్లించినట్లుగానే ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఆస్పత్రిలో పనిచేసే కార్మికుల వేతనాలపై న్యాయం జరిగేందుకు ఐఏఎస్ అధికారిని నియమించాలన్నారు. మార్పు నినాదంతో వచ్చిన ప్రభుత్వం వాటిని సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో గంధం శ్రీను, మోహన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఉత్సవాలు



ఖిల్లాఘనపురం: మండలంలోని హీర్లతండాలో సోమవారం ఆంజనేయస్వామి ఉత్సవాలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆంజనేయస్వామి మాల ధరించిన భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తండావాసులు అనంతరం స్వామి వారి కలశ పూజ, పల్లకీ సేవ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముగ్గుల పోటీలు



కొత్తకోట రూరల్: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు ఎంపీపీ గుంత మౌనిక తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ రవిందర్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు అల్లబాషా తదితరులు ఉన్నారు.

ఉద్యోగికి సన్మానం



పెబ్బేరు రూరల్: వనపర్తి విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సీహెచ్ రాజప్ప ఈ నెల 6న జేఎన్‌టీయూ, అనంతపూర్ యూనివర్ సిటీ 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నాడు. డాక్టరేట్ పొందిన సీహెచ్ రాజప్పను సోమవారం వనపర్తిలోని డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో ట్రాన్స్‌కో సిబ్బంది సన్మానించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్లలో సోమవారం బిచ్చారెడ్డి, వెంకటమ్మ స్మారకార్థం ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని ఉమ్మడి గోపాల్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి ప్రారంభించారు. మొత్తం 25 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.ఇరవై వేలు అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాములోరి అక్షితలు ఊరేగింపు

అమరచింత: అయోధ్య సీతారామస్వామి అక్షింతలను సోమవారం సింగంపేటలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. శ్రీరాములోరి అక్షితల కలశాలను గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి తరలించి ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజు వీటిని కుటుంబ సభ్యులు భక్తితో తలపై చల్లుకోవాలని గ్రామ ప్రజలకు వివరించారు. అనంతరం అక్షితలను ఇంటింటికీ వితరణ చేశారు. కార్యక్రమంలో నర్సింహారావు, నారాయణ, మహేష్, హారీస్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురంలో సోమవారం భక్తులు చింతల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షింతల కలశాలకు పూజలు నిర్వహించి, గ్రామంలో ఇంటింటికీ తిరిగి అక్షింతలతో పాటు ఫొటో, కరపత్రాన్ని పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన కొనసాగే సందర్భంగా ఇళ్లల్లో పూజలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భగవంతుయాదవ్, గ్రామ పెద్దలు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో మూడు రోజులుగా అయోధ్య రాములోరి అక్షింతలను రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తున్నారు. భక్తులకు ఆయురారోగ్యాలు కలగాలని వేద పండితులు వెంకటేశ్వరచార్యులు ఆశీర్వచనాలు ఇచ్చారు. కార్యక్రమంలో తిరుమల్‌రెడ్డి, రాములు ,అనంతరాములు గౌడ్ తదితరులు ఉన్నారు.



సింగంపేటలో అక్షింతల ఊరేగింపు



దుప్పల్లిలో..



రంగాపురంలో..

పాఠశాల ఆవరణలో కూలిన వేపచెట్టు

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న వేప చెట్టు కొమ్మలు ఒక్కసారిగా విరిగి పడ్డాయి. చెట్టు కొమ్మలు విరిగి పడిన సమయంలో విద్యార్థులు పరిసరాల్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ఎంఈఓ భాస్కర్ సింగ్ తెలిపారు. పాఠశాల ఆవరణలో పురాతనమైన వేప చెట్టు ఉందని, వాటి కొమ్మలు బలహీనంగా మారుతుండటంతో విరిగి పడుతున్నాయని పాఠశాల ప్రధానోపధ్యాయుడు బలరాముడు పేర్కొన్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు ఇదే చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయన్నారు. పాఠశాల విద్యార్థులు చెట్టు నీడలో చదువుకుంటుంటారని, అలాంటి సమయంలో కొమ్మలు విరిగి పడితే ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పాఠశాలలో బలహీనంగా ఉన్న వేప చెట్టును తొలగించాలని కోరారు. ఈవిషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు వివరించామని, డీఈఓ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.



పాఠశాల ఆవరణంలో కూలిన వేప చెట్టు కొమ్మలను చూపిస్తున్న ఎంఈఓ

కొనసాగుతున్న దరఖాస్తుల కంప్యూటరీకరణ



పాన్‌గల్‌లో ఆన్‌లైన్ నమోదు వివరాలను పరిశీలిస్తున్న అధికారులు



గోపాల్‌పేటలో మీసేవ కేంద్రంలో ఆన్‌లైన్ చేస్తున్న ఆరు గ్యారంటీల దరఖాస్తులు

పాన్‌గల్: ఆరు గ్యారంటీల పథకాల అమలు కోసం ప్రజల నుంచి వచ్చిన ప్రజా పాలన దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని సోమవారం మండల అధికారులు పరిశీలించారు. మండలంలోని 28 పంచాయతీల్లో వచ్చిన 17,030 దరఖాస్తులను ఎంపీడీఓ, తహసీల్దార్, ఎమ్మార్సీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో 8, తహసీల్దార్ కార్యాలయంలో 5, కలెక్టర్ కార్యాలయంలో 8, ఎమ్మార్సీ కార్యాలయంలో 2 చొప్పున మొత్తం 23 ఆపరేటర్లు వివరాలను నమోదు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆయా వివరాలను ఈనెల 17వ తేదీ వరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రహిమాన్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, డీటీ అశోక్‌నాయుడు, ఆర్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు ఫారాలు సోమవారం మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాల్లో దర్శనమిచ్చాయి. విషయాన్ని కొందరు గ్రామస్తులు కొందరు గమనించి 'సాక్షి' దృష్టికి తీసుకురాగా.. మీసేవ కేంద్రానికి వెళ్లి ఇదేంటని ప్రశ్నించింది. దరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు తమకు చెప్పారని, దరఖాస్తుకు రూ.పది చొప్పున వస్తుందని తెలిపారు. ఇదే విషయం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా తమ కార్యాలయంలో కంప్యూటర్లు తక్కువగా ఉన్నాయని, దీనికి తోడు అనంతపురంలో కంప్యూటర్ లేదని, మీ సేవలో అప్‌లోడ్ చేయమని అనంతపురం సెక్రెటరీ మహేష్‌కు సూచించామని పేర్కొన్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి దగ్గరుండి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాడని సమాధానమిచ్చారు. ఏది ఏమైనా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమని, వాటి దరఖాస్తులు బయట కనిపించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

పాన్‌గల్: మెరుగైన విద్య కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి అన్నారు. బడిఈడు పిల్లల ఇంటింటి సర్వేలో భాగంగా సోమవారం మండలంలోని కదిరెపాడులో బడి మానేసి ఇంటి పనులు చేస్తున్న విద్యార్థుల వివరాలను తెలుసుకొని వారి ఇళ్లకు వెళ్లి విద్య యొక్క ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, మెరుగైన విద్య అందిస్తున్నామని తెలిపారు. బడి ఈడు కలిగిన పిల్లలచే పనులు చేయించడం నేరమని, చదువుకోవడం వారి హక్కు అని స్పష్టం చేశారు. బడి ఈడు కలిగిన పిల్లలను తప్పక బడులకు పంపించాలని కోరారు.



పాన్‌గల్‌లో బడిఈడు పిల్లల సర్వేలో సీఆర్పీలు

చలో పార్లమెంట్ వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న మొగిలి

కొత్తకోట రూరల్: పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో చలో పార్లమెంట్ వాల్ పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ఎడ్యుకేషన్ పాలసీని అమలు చేయొద్దంటూ దేశంలోని 32 విద్యార్థి సంఘాల పిలుపు మేరకు ఈనెల 12 ఢిల్లీలో చలో పార్లమెంట్ మార్చ్ అందరూ తరలి రావాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలైన నవోదయ పాఠశాల, సైనిక్ స్కూల్స్, ఐఐటీలు, ఐఏఎంలు, ఏకలవ్య మోడల్ స్కూల్స్ వంటి వాటిని ఏర్పాటు చేసి కొత్త ఎడ్యుకేషన్ పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని, విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రాధిక, మహేష్, అనురాధ, జనార్దన్, అంజి, నాగరాజు, మల్లేష్, మహాలక్ష్మి, తదితరులు ఉన్నారు.

పేదరిక నిర్మూలనకే సంక్షేమ పథకాలు



క్యాలెండర్లను విడుదల చేస్తున్న అధికారులు

ఆత్మకూర్: పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. సోమవారం పట్టణంలోని వివేకానంద చౌక్‌లో వికసిత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జన్‌ధన్, సురక్ష, కిసాన్‌సమ్మాన్‌యోజన, అటల్‌పెన్షన్, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాల గురించి ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా అత్యాధునిక వ్యవసాయం గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, హెల్త్‌సూపర్‌వైజర్ సామాజ్యలక్ష్మి, మున్సిపల్‌ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆత్మకూర్: పీఆర్టీయుటీఎస్ ఉపాధ్యాయ సంఘం 2024 క్యాలెండర్‌ను సోమవారం ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్ ఆవిష్కరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పీఆర్టీయూ అమరచింత, ఆత్మకూర్ మండలాల నాయకులు రాఘవేందర్, విజయ్, హనుమంతు, విజయప్రకాష్, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీరాములు, సత్యన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, భానుప్రియ, గీతరాణి, రాధిక, కళావతి, సౌమ్య, వైస్‌ఎంపీపీ కోటేష్, ఎంపీటీసీ పరమేష్ ఉన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్ గ్రామంలో సగర సంఘం 2024 క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. స్థానిక అంజనేయస్వామి దేవాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, మాజీ సర్పంచ్ నారాయణ, సగరులు రాంచందర్, భీమయ్యసాగర్, శాఖాపూర్ శ్రీను, పల్లె జగన్, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.